క్లుప్తంగా

బియ్యం అందజేత



పలిమెల: మండలంలోని ముకునూర్ గ్రామానికి చెందిన కురసం రామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సర్పంచ్ ఆలం సత్యనారాయణ, ఉప సర్పంచ్ పొడెం సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పరామర్శించి, బియ్యం అందజేశారు. పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పొదెం సురేందర్, ఆట్టం శ్రీను, రాకేష్, కనకయ్య, వినోద్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ పాఠశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్కూల్ ప్రిన్స్‌పాల్ దూడ వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌ల్లో 40 సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. 10 తరగతి పాసైన విద్యార్థిని, విద్యార్థులు ఈనెల 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 14, సీఈసీలో 14, బైపీసీలో 20 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు తరలిరావాలి

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో చేపడుతున్న బొడ్రాయి, గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి(బుధవారం) నుంచి 20 వరకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 20న విగ్రహాల ప్రతిష్ఠాపన అనంతరం తాడిచర్ల బొగ్గు సేకరణ పనులు నిర్వహిస్తున్న ఏఎమ్మార్ కంపెనీ ఆధ్వర్యంలో మహా అన్నదానం చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

ఏజెన్సీలో నాణ్యతలేని నిర్మాణాలు

ఏటూరునాగారం: ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లు నాణ్యతగా లేవని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ జాడి రామరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రొయ్యూర్ గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. సీసీ రోడ్లు, భవనాలు నిర్మిస్తున్నారు గానీ దానికి సైన నీటితో క్యూరింగ్ చేయడం లేదన్నారు. సంబంధిత అధికారులు బిల్లులు చేసే ముందు ఒక్కటికి రెండు సార్లు పరీక్షించి చేయలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కాంట్రాక్టర్లుగా మారి ఇష్టానురాజ్యంగా పనులు చేస్తారన్నారు. దీనివల్ల ప్రజల సొమ్ము రోడ్ల పాలు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జల సాగర్, సోదరి బానయ్య, జనగాం దుర్గారావు, శంకరయ్య, సమ్మయ్య, కుమ్మరి సత్యంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

కాటారం: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు పాటించాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మంగళవారం వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ.. డెంగీ నివారణ కోసం జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. చెత్తకుండీలు, మురుగునీటి కాల్వలు, టైర్లు, కూలర్లు ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, ఏఎన్ఎం, ఆశవర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాముత్తారం: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మండలకేంద్రం వరకు వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజకుమారి, స్టాఫ్‌నర్సు గీతాంజలి, ఏఎన్ఎంలు కుమార, స్వరూప, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.

మహదేవపూర్: డెంగీ జ్వరం బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ జగదీష్ సూచించారు. మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి డెంగీ వ్యాధి నివారణ గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలకు, ఏఎన్ఎంలకు డెంగీ వ్యాధి నివారణ, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మాషూక్ అలీ, సత్యనారాయణ, ఏఎన్ఎంలు ఆశవర్కర్లు పాల్గొన్నారు.



కాటారం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, వైద్య సిబ్బంది

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ.. దోమలు పుట్టకుండా చూద్దాం- దోమలు కుట్టకుండా చూద్దాం... డెంగె వ్యాధిని తరిమికొడదాం.. అనే నినాదంతో ప్రతి శుక్రవారం ఫ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దయామని, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ల్యాబ్ టెక్నీషియన్ సంపూర్ణ, స్టాఫ్ నర్స్ సరిత, ఏఎన్ఎం శ్రీలత, డీఈఓ జోష్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మహదేవపూర్: అవగాహన కల్పిస్తున్న వైద్యుడు



మొగుళ్లపల్లిలో..



మహాముత్తారంలో..

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

టేకుమట్ల: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తరుగు లేకుండా కొనుగోలు చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అప్పులు తెచ్చి ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులకు ఒక సవాల్‌గా మారిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్లు రైతులను మోసం చేస్తూ క్వింటాకు 10కిలోల చొప్పున తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. ఇంత మోసం జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతీ గింజ కొంటామని మాటలే చెప్తున్నారని, ఆచరణలో మాత్రం శూన్యమని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి రైతుల ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆకునూరి జగన్, కసరవేని కుమార్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మారెపెల్లి మల్లేష్

ఇళ్ల స్థలాల సాధనకు ప్రణాళిక

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో పని చేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నట్లు కాకతీయ ప్రెస్ క్లబ్ అడహక్ కమిటీ కన్వీనర్ నాగపురి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాకతీయ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత నమోదు కార్యక్రమం జర్నలిస్టుల సహకారంతో 100 మైలురాయి దాటిందని అడహాక్ కమిటీ ఎన్నిక తర్వాత చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సహకరించిన జర్నలిస్టులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పూర్తి పారదర్శకతతో, అక్రిడిటేషన్ ప్రాతిపదికన ఇళ్ల స్థలాల జర్నలిస్టుల లిస్ట్ ఎంపిక ఉంటుందన్నారు. నూతన కమిటీ పూర్తిస్థాయిలో చర్చించి ఎవరికి ఇబ్బందులు లేకుండా జాబితా సిద్ధం చేస్తామన్నారు. ఈ సమావేశంలో కో కన్వీనర్లు పోతరాజు రవిభాస్కర్, జల్ది రమేష్, బెల్లం తిరుపతి, ఆరెల్లి నరేందర్‌గౌడ్, ఎడ్ల సంతోష్, సామల శ్రీను, తిక్క ప్రవీణ్, బండ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

మంథనికి తరలిన బీఆర్ఎస్ నాయకులు



కాళేశ్వరం: మంథనికి వెళ్తున్న నాయకులు



పలిమెల: నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

పలిమెల: పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు నేతృత్వంలో మంథనిలో జరిగే బీపీ మండల్ విగ్రహావిష్కరణ బహిరంగ సభకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ నాయకుతో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గా ప్రజలు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం నుంచి పెద్దపల్లి జిల్లా మంథనికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. పెద్దపల్లి జిల్లా జెడ్పీచైర్మన్ పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో బిహార్ మాజీ సీఎం, ఓబీసీ రెండవ జాతీయ చైర్మన్ బిందేశ్వరీ ప్రసాద్ మండల్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి బీఆర్ఎస్ నాయకులు రేవెల్లి నాగరాజు, ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, ఉప సర్పంచ్ ఆరుట్ల పవన్‌లు వేర్వేరుగా వెళ్లారు.

అక్రమ పట్టాలను రద్దు చేయండి

మంగపేట: మండలంలో ప్రభుత్వ భూములనకు అక్రమంగా చేసిన పట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు మంగళవారం వనితిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ మాట్లాడుతూ.. తిమ్మంపేట రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్ 232/16లోని ఆదివాసీ గిరిజనుడైన మోడెం లక్ష్మయ్యకు చెందిన 31 గుంటల భూమిని 1/70, ఎల్‌టీఆర్ చట్టం అమలులో ఉండాగా రెవెన్యూ అధికారులు గిరిజనేతరులకు ఎలా పట్టా చేశారని ఆరోపించారు. అదే విధంగా అధికారులు ప్రభుత్వ భూములకు సైతం పట్టా చేశారని వెంటనే అక్రమంగా చేసిన పట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షురాలు ఈసం సరిత, టింగ బుచ్చయ్య, వెంకటాపురం మండల అధ్యక్షుడు తుర్స కృష్ణబాబు, ప్రధాన కార్యదర్శి కంతి నేత్రానందుకుమార్, ఏటూరునాగారం ఏఎంఎస్‌పీ మండల కార్యదర్శి పూనెం నిర్మల ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై తిరుపతిరావు మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వీరభద్రవరం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గుడుంబా విక్రయాలు సాగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సుమారు నాలుగు వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయటంతోపాటు 300 కిలోల బెల్లం, 30 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను, స్వాధీనం చేసుకున్న బెల్లం పటికను ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై వెల్లడించారు.

పనులు పకడ్బందీగా చేపట్టాలి

కాటారం: గ్రామ పంచాయతీల్లో ఈ నెల 17 నుంచి 23 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, ఇతర కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీఓ శంకర్ నాయక్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల పాటు గ్రామ పంచాయతీల్లో రోడ్లను శుభ్రపర్చుట, గుంతలను పూడ్చివేయుట, మురుగునీటి కాల్వల నిర్వహణ, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్‌లను శుభ్రపర్చాలని సూచించారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని నీటి నిల్వలు ఉండకుండ చర్యలు తీసుకోవడంతో పాటు దోమల పెరుగుదల నివారణ చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి రోజు గ్రామాల్లో ఫాగింగ్ చేయించడంతో పాటు నిరుపయోగంగా మారిన బావులు, బోర్‌వెల్స్ పూడ్చివేయాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహణ, గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు నిర్మించుకొని ఉపయోగించుకునేలా అవగాహన చేపట్టాలని అన్నారు.

పలిమెల: ఈనెల 17 నుంచి 23 వరకు గ్రామాల్లో నిర్వహించనున్న స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌పై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గ్రామాల్లో పిచ్చి మొక్కల తొలగింపు, ప్లాస్టిక్ నిషేధం, సైడ్ కాల్వల క్లీనింగ్, వాటర్ ట్యాంక్ క్లీనింగ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ సునీత, ఈసీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



కాటారం: మాట్లాడుతున్న సంజీవరావు



పలిమెల: మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి

సన్మానం



మహ్మద్ ఖాజాను సన్మానిస్తున్న మహిళలు

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామంలో చెడిపోయిన చేతిపంపునకు మంగళవారం రూ.35వేలతో ఖర్చుతో మరమ్మతులు చేపట్టి మంచినీటి సౌకర్యం కల్పించిన భారత సమాజ్ డెవలప్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఖాజాను మహిళలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమ సమస్య తెల్సుకొని ఇబ్బందులు పడకుండా బోరుబావికి మరమ్మతు చేపట్టిన మహ్మద్ ఖాజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బోడ గణేష్, మహిళలు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై షాఖాన్

చిట్యాల: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్సై ఎండీ.షాఖాన్ అన్నారు. మంగళవారం మండలంలోని గోపాలపూర్ గ్రామ శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో సౌకర్యాలు కల్పించాలి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఆర్టీసీ డిపోలోని బస్సుల్లో ప్రయాణికులను ఉండాల్సిన సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పనునూటి రాజేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిపోలోని పల్లె వెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్ సర్వీసులుగా నడిపిస్తూ అధిక చార్జీలు వసూళ్లు చేస్తున్నారన్నారు. పేద ప్రజలకు పల్లె వెలుగు సర్వీసు సేవలు అందించడం లేదన్నారు. అంతేకాకుండా ఫస్ట్‌ఎడ్, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉండటం లేదన్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులను సరిపడ వసతులు లేవన్నారు. అంబేడ్కర్ సెంటర్‌లో పరకాల వెళ్లే ప్రధాన రహదారిపై బస్సులు నిలపకుండా చుడాలన్నారు. సూపర్‌లగ్జరీ, డిలక్స్ బస్సుల సమయ సూచికలను తెలియజేయాలన్నారు. రామప్ప కాలనీ వరకు రోజుకు నాలుగు ట్రిప్‌ల బస్సు సర్వీస్‌లను నడిపించాలన్నారు. దేవన్, జంపయ్య, మహేష్‌రెడ్డి, కర్ణకర్, కొమురయ్య, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ క్లినిక్ సందర్శన

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఉన్న ఆకులవారిఘణపురం 3 సబ్ సెంటర్‌లో ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ క్లినిక్‌ను చేపట్టి మహిళలకు ఉచితంగా పరీక్షలు, మందులు ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఈ క్లినిక్‌ను డీఎంహెచ్ఓ అప్పయ్య సందర్శించి మహిళలకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెండు సెంటర్లు మాత్రమే ఇప్పుడు పనిచేస్తున్నాయన్నారు. ఒకటి ఏటూరునాగారం గ్రామంలో, మరొకటి ఎదిరలో ఉన్నాయన్నారు. ఈ సేవలను జిల్లా వ్యాప్తంగా చేపట్టడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గ్రామీణ మహిళలకు సోకే వ్యాధులు ఎక్కువగా ఉంటున్నాయని, ఇక్కడ 8 రకాల పరీక్షలు చేసి మందులు ఇవ్వడంతోపాటు రెఫర్ చేయడం, శస్త్ర చికిత్సలు ఉచితంగా చేసే వరకు వారిపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. అనంతరం జెడ్పీకోఆప్షన్ సభ్యురాలు వలియాబీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతుందని, అందుకోసమే ఈ ఆరోగ్య క్లినిక్ చేపట్టిందన్నారు. దీనివల్ల అనేకమంది మహిళలకు వేలాది రూపాయలు విలువ చేసే పరీక్షలు, స్కానింగ్, మందులు ఉచితంగా లభిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రొయ్యూర్ పీహెచ్‌సీ వైద్యురాలు సుమలత, డాక్టర్ మౌనిక, సీహెచ్ఓ శారద, ఎన్‌సీడీ స్టాఫ్ నర్సు శ్రీలత, మంగపేట పీహెచ్‌సీ ఎస్ఎన్ త్రివేణి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీను, రజిత, నిర్మల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

మంగపేట: జాతీయ మానవ హక్కుల మండల కమిటీ ఎన్నిక మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా అధ్యక్షుడు పాల్తీయ రాజశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా గాదె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గుడిసేవ నాగేశ్వర్‌రావు, తోలెం నర్సింహారావు, కోశాధికారిగా పూజారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్‌హుస్సేన్, ప్రచార కార్యదర్శిగా గుండారపు రమేష్‌ను ఎన్నుకున్నారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాల గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల రాష్ట్ర కార్యదర్శి ఎలకంటి రాజు, జిల్లా ఈసీ మెంబర్ మేడిద సతీష్, గౌరవ సలహాదారుగా మల్లికంటి శంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఎం కప్ పోటీలు



కాటారం: బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ



మహదేవపూర్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న సీఐ



పలిమెల: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

చిట్యాల: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడలు మంగళవారం రెండవ రోజు కొనసాగాయి. కబడ్డీలో ప్రథమ స్థానం చల్లగరిగ, ద్వితీయ స్థానం నైన్‌పాక, ఖోఖోలో ప్రథమ స్థానం తిర్మలాపూర్, ద్వితీయ స్థానం నైన్‌పాక, వాలీబాల్‌లో ప్రథమ స్థానం చిట్యాల, ద్వితీయ స్థానం అందుకుతండా గ్రామాల జట్లు గెలపొందాయి. నేడు(బుధవారం) బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీఓ రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ సీఈఓ విజయలక్ష్మీ, ఎంపీపీ దావు వినోద, జెడ్పీటీసీ గొర్రె సాగర్ రానున్నట్లు పేర్కొన్నారు.

పలిమెల: మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు రెండవ రోజు మంగళవారం కొనసాగాయని సీఎం కప్ క్రీడల కన్వీనర్ ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. క్రీడా పోటీల్లో భాగంగా బోడాయిగూడెం క్రీడా ప్రాంగణంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో కబడ్డీలో విజేతగా ముకునూర్, వాలీబాల్‌లో విజేతగా దమ్మూరు, ఖోఖోలో విజేతగా సర్వాయిపేట జట్లు నిలిచినట్లు తెలిపారు. విజేతలకు నేడు(బుధవారం) ఉదయం 10గంటలకు ఎంపీపీ బుచ్చక్క చేతుల మీదుగా బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు.




చిట్యాల: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు, పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: సీఎం కప్ 2023లో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వాలీబాల్ విభాగంలో కొత్తపల్లి బీ జట్టు మొదటి స్థానంలో, కొత్తపల్లి ఏ టీం ద్వితియ స్థానం, కబడ్డీ విభాగంలో కాటారం మొదటి స్థానం, గారెపల్లి ద్వితీయ స్థానం, ఖోఖో గూడూరు మొదటి స్థానం, గంగారం ద్వితియ స్థానం, అథ్లెటిక్ 100 మీటర్ల రన్నింగ్‌లో మాతలత ప్రథమ, సృజన ద్వితీయ, 400 మీటర్ల రన్నింగ్‌లో శ్రీకాంత్ ప్రథమ, అఖిల్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, తహసీల్దార్ జివాకర్ రెడ్డి, ఎంపీడీఓ శంకర్‌నాయక్, పీడీలు రమేష్, శ్రీనివాస్, రాజేశ్వరీ, రాధ, చందు, అజయ్, వెంకటేశ్, రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలో సీఎంకప్ క్రీడలను రెండో రోజు మంగళవారం సీఐ కిరణ్ ప్రారంభించారు. మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలల ఆవరణలో ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, ఎంపీడీఓ రవీంద్రనాథ్, సర్పంచ్ శ్రీపతి బాపు, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనందించాలి

ములుగు రూరల్: దివ్యాంగులకు చేయూతనందించాలని పస్రా ఎస్సై కరుణాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని బుస్సాపూర్ గ్రామానికి చెందిన కొమ్మ కోమల-శ్రీనివాస్ దంపతులు ఇద్దరు దివ్యాంగులు స్నేహితుల సహాయంతో ఏర్పాటు చేసుకున్న కిరాణం షాపును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించి చేయూతనందించి మానవత్వం చాటుకున్న శ్రీనివాస్ మిత్రులు రవీందర్, మహేందర్‌రెడ్డి, సతీష్, నాగేశ్వర్‌రావు, యూసఫ్, ఇంద్రరెడ్డిలను ఎస్సై అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగం శ్రీలతచందు, ఉప సర్పంచ్ బేతి దేవేందర్‌రెడ్డి, సాంబయ్య, నెమలి బాలకృష్ణ, దినేష్, సాంబయ్య ఉన్నారు.



నూతన షాపును ప్రారంభిస్తున్న ఎస్సై